జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

సోమవారం | 13-07-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 726 పేజీలు: 4 వెల : రూ.7

## కార్గో ఎయిర్‌పోర్టుపై..

# భగ్గుమన్న రైతాంగం

* మంత్రి రామ్మోహన్ నాయుడు సమక్షంలో ఉద్రిక్తత * సభలో ఉద్రిక్తత, పోలీసుల మోహరింపు * మేం యుద్ధం చేయడానికి రాలేదు.. మీ అభిప్రాయం తెలుసుకునేందుకే వచ్చాం: మంత్రి * కార్గో ఎయిర్‌పోర్టుతో మా జీవితాలు నాశనం: రైతులు * మంత్రికి వినతిపత్రం ఇచ్చిన కొందరు ఉద్దాన రైతులు



మందస, జులై 12 (వార్త): జిల్లాలో ప్రతిపాదిత కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణంపై స్థానిక ఉద్దానం రైతాంగం తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, స్థానిక శాసనసభ్యురాలు, జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఇతర ఉన్నతాధికారుల సమక్షంలో బిడిమిలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ సభ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. మా పొట్టలు కొట్టొద్దు.. రైతుల ఆవేదన సభలో పాల్గొన్న స్థానిక రైతులు మైక్ అందుకుని తమ ఆవేదనను, నిరసనను బాహాటంగా వెళ్లగక్కారు. రెండు మండలాల్లోని సుమారు 18 గ్రామాలకు చెందిన 1400 ఎకరాల సారవంతమైన భూములను ఈ విమానాశ్రయం కోసం సేకరించాలని చూడటం సమంజసం కాదని వారు పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో కొబ్బరి, జీడిమామిడి, పనస వంటి అంతర పంటలతో నిరంతరం ఆదాయం ఇచ్చే పచ్చని భూములు ఉన్నాయని, వీటిని నాశనం చేయవద్దని కోరారు. ఒక కొబ్బరి చెట్టును పెంచి, అది కాపునకు రావడానికి ఒక రైతుకు కనీసం 10 నుండి 15 సంవత్సరాల కాలం పడుతుందని, తమకు కొబ్బరి చెట్టు చనిపోతే ఇంట్లో మనిషి చనిపోయినంత బాధ కలుగుతుందని కన్నీరు పెట్టుకున్నారు. 2018 నాటి 'తిత్లీ' తుఫాను వల్ల ఉద్దానం పూర్తిగా దెబ్బతిన్నప్పుడు, నాటి ప్రభుత్వం ఇచ్చిన భరోసాతో మళ్లీ ఎంతో కష్టపడి తోటలను పెంచుకున్నామని, ఇప్పుడు ఆ తోటలను ప్రభుత్వమే నరికేస్తామంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. తాము అభివృద్ధికి వ్యతిరేకం కాదని, ఈ ప్రాంతంలో ఎయిర్‌పోర్ట్ నిర్మించాలనుకుంటే నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భూములు లేదా కొండ ప్రాంతాలను పరిశీలించాలని, పంట భూములను వదిలిపెట్టాలని డిమాండ్ చేశారు. గత 20 నెలలుగా తాము మానసిక ఆవేదన అనుభవిస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

### సభలో ఉద్రిక్తత, పోలీసుల మోహరింపు..

సభ జరుగుతున్న సమయంలో రైతులు, యువకులు ఒక్కసారిగా ముందుకు దూసుకురావడంతో సభలో గందరగోళం నెలకొంది. నినాదాలతో సభా ప్రాంగణం హోరెత్తింది. పరిస్థితి చేజారకుండా ఉండేందుకు భారీగా మోహరించిన మహిళా పురుష పోలీసు సిబ్బంది రంగంలోకి దిగి రైతులను శాంతింపజేసేందుకు ప్రయత్నించారు.

### రైతుల సమ్మతితోనే ముందడుగు..

మంత్రి రామ్మోహన్ నాయుడుసభలో నెలకొన్న గందరగోళంపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు స్పందించారు. మైక్ చేతబూని ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ, "మేము ఇక్కడికి ఎవరితోనూ గొడవ పడటానికి లేదా యుద్ధం చేయడానికి రాలేదు. మీ అభిప్రాయాలను, ఆవేదనను వినడానికే వచ్చాం. అందరికీ ఆమోదయోగ్యంగా, రైతుల సమ్మతితోనే నిర్ణయాలు ఉంటాయి తప్ప, ఎవరినీ బలవంతం చేయం" అని స్పష్టం చేశారు. అందరూ శాంతియుతంగా ఉండి, చర్చలకు సహకరించాలని ఆయన కోరారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతుండటంతో, ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే దానిపై ఉత్కంఠ నెలకొంది.



## పలాస ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి సహకరించాలి

* కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు
* బిడిమిలో అభిప్రాయ సేకరణ



మందస, జులై 12(వార్త):పలాస ప్రాంతంలో విమానాశ్రయ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఉద్దాన ప్రాంత ప్రజలు ఇందుకు పూర్తి స్థాయిలో సహకరించాలని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు. మందస మండలం బిడిమి గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో స్థానిక యువత ఉపాధి, వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టుకు అందరూ మద్దతుగా నిలవాలని కోరారు. ఎయిర్పోర్ట్ నిర్మాణం వల్ల వెనుకబడిన ఉద్దాన ప్రాంతం పారిశ్రామికంగా, ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భూములు కోల్పోయే నిర్వాసితులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారికి చట్టప్రకారం తగిన నష్టపరిహారం, పునరావాసం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం కొందరు చేసే దుష్ప్రచారాలను నమ్మవద్దని, ప్రాంతీయ ప్రగతికి అందరూ చేతులు కలపాలని కోరారు. అనంతరం రైతులు మాట్లాడుతూ తమ పచ్చని ఉద్దానంలో కార్గో ఎయిర్ పోర్టు నిర్మిస్తే భూములను కోల్పోతామన్నారు. తరతరాలుగా తోటలపై ఆధారపడి బతుకుతున్నారు. ఈ సమావేశంలో పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష, జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర్ రెడ్డిలతో పాటు పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, ఉద్దాన ప్రాంత రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పారసంబలో రూ.25 కోట్ల విలువైన పచ్చబయలుపై..

# భూ మాఫియా కన్ను!

* రెవెన్యూ అండతో గ్రేజింగ్ ల్యాండ్ దున్నేసిన భూ బకాసురుడు * డిప్యూటీ తహశీల్దార్, ఆర్ఐ, వీఆర్వోలకు భారీ ముడుపులు ఇచ్చానంటూ ప్రచారం * ప్రభుత్వ పోరంబోకు భూముల రక్షణపై స్థానికుల ఆందోళన * పరిశీలించి చర్యలు తీసుకుంటామన్న తహశీల్దార్

పలాస, జులై 12 (వార్త): ప్రభుత్వ భూములపై భూ మాఫియా కన్ను పడిందా..? పశువుల మేత కోసం కేటాయించిన పచ్చిక బయలును సైతం కబ్జా చేసేందుకు పక్కా ప్రణాళిక అమలు చేస్తున్నారా..? అంటే పలాస మండలంలోని పారసాంబ రెవెన్యూ పరిధిలో వెలుగుచూస్తున్న పరిణామాలు చూస్తుంటే అందరికీ అవుననే అనుమానాలు కలుగుతున్నాయి. పారసాంబ రెవెన్యూ పరిధిలో జాతీయ రహదారి పక్కనే ఉన్న సర్వే నంబర్-183లో సుమారు 1.5 ఎకరాల ప్రభుత్వ పచ్చిక బయలు (గ్రేజింగ్ ల్యాండ్)ను ట్రాక్టర్లతో దున్నేసిన ఘటన చర్చనీయాంశంగా మారింది. పశువుల మేత కోసం ప్రభుత్వం కేటాయించిన ఈ భూమిపై ఎలాంటి హక్కులు లేకపోయినా, సొంత వ్యవసాయ భూమిలా దుక్కులు వేసి ఆక్రమించేందుకు భూ బకాసురులు ప్రయత్నిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. జాతీయ రహదారి ఆనుకుని ఉండటంతో ఈ భూమికి భారీగా డిమాండ్ ఏర్పడిందని, ప్రస్తుతం దీని మార్కెట్ విలువ సుమారు రూ.25 కోట్ల వరకు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఈ విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చేసి ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి పంపించేందుకు భూ మాఫియా ముఠా పావులు కదుపుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికుల ఆరోపణల ప్రకారం, ప్రభుత్వ పోరంబోకు భూములు, పచ్చిక బయళ్లు ఆక్రమించేందుకు కొందరు రెవెన్యూ అధికారుల సహకారం తీసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇందుకోసం డిప్యూటీ తహశీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ), వీఆర్వోలకు భారీ మొత్తంలో ముడుపులు ఇచ్చినట్లు స్థానికంగా ప్రచారం సాగుతోంది. ఈ ఆరోపణలకు సంబంధించి అధికారికంగా ఎలాంటి నిర్ధారణ లేదు. పశువుల మేత కోసం ఉంచిన గ్రేజింగ్ ల్యాండ్‌ను సైతం వదలకుండా ఆక్రమణలకు పాల్పడటం పట్ల గ్రామస్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన వ్యవస్థే నిర్లక్ష్యం వహిస్తే, భవిష్యత్తులో మరిన్ని పోరంబోకు భూములు కబ్జాకు గురయ్యే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకుని సర్వే నంబర్-183లోని పచ్చిక బయలును పరిశీలించి, ఆక్రమణ యత్నాలను అడ్డుకోవాలని, ప్రభుత్వ భూములను సంరక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడడంతో పాటు, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ వ్యవహారంపై పలాస తహశీల్దార్ శ్రీదేవిని వివరణ కోరగా, "విషయాన్ని పరిశీలించి, వాస్తవాలను నిర్ధారించిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



## వివాహిత ఆత్మహత్య

* కుటుంబ వేధింపులే కారణమా?



శ్రీకాకుళం క్రైం, జులై 12 (వార్త): శ్రీకాకుళం నగరంలోని ఆదివారం పేటలో వివాహిత షర్మిల (26) ఆత్మహత్య చేసుకుంది. ఆమె ఆత్మహత్య వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. షర్మిల స్వస్థలం పొందూరు మండలం బొడ్డేపల్లిపేట. ఆమెకు ఆదివారంపేటకు చెందిన ఓ వ్యక్తితో ఏడాది కిందట వివాహమైంది. ఈ నెల 8వ తేదీ రాత్రి భర్త కోసం ఆమ్లెట్ తయారు చేసి ఉంచిన విషయమై, మరిది భోజనంపై శ్రద్ధ చూపలేదంటూ అత్త మందలించినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అయితే ఎప్పటి నుంచో అత్త, మామ, భర్త, మరిది కలిసి తనను మానసికంగా వేధిస్తున్నారని ఆమె తన కుటుంబ సభ్యులకు చెప్పినట్లు వారు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో మనస్థాపానికి గురైన షర్మిల, శనివారం అర్ధరాత్రి సమయంలో ఇంటి మేడపై ఉన్న వంటగదిలో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే పోలీసులు.. కుటుంబ వేధింపుల కోణంలోనూ విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిసింది.

## రౌడీ షీటర్లకు పోలీసుల కౌన్సిలింగ్

శ్రీకాకుళం క్రైం, జులై 12 (వార్త): చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండి,నేర ప్రవృత్తికి స్వస్తి పలికి, సత్ప్రవర్తనతో నడుచుకోవాలని జిల్లాలో గల రౌడీ షీటర్లకు పోలీసు అధికారులు కౌన్సిలింగ్ నిర్వహించారు. పోలీసు వారు సూచనలు, ఆదేశాలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆదివారం పలు పోలీసు స్టేషను పరిధిలో రౌడీ షీటర్లకు పోలీసు అధికారులు కౌన్సిలింగ్ చేశారు. శ్రీకాకుళం జిల్లా పట్టణ కేంద్రంగా ఒకటవ, రెండవ పట్టణ, రూరల్ పోలీస్ స్టేషన్ల పోలీసు అధికారులతో పాటు జిల్లాలో పలు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లు, చెడు నడత గలవారిని పోలీస్ అధికారులు కౌన్సిలింగ్ నిర్వహించి నేరాలు చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, ఘర్షణలకు దూరంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ ఎలాంటి నేరాలకు పాల్పడకుండా నేర ప్రవృత్తిని మాని మంచి నడవడికతో, సత్ప్రవర్తనతో మెలగాలని, ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలలో పాల్గొవడం చేయరాదని, ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రతి ఒక్కరు చెడు వ్యసనాలను దూరం చేసుకుని మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఎటువంటి కారణాలు లేకుండా ఘర్షణలు సృష్టించిన ప్రతి ఒక్కరిపై పోలీస్ వారి నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఎవ్వరైనా ఎక్కడైనా గొడవలు, ఇతర నేరాలలో పాల్గొంటే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసు అధికారులు హెచ్చరించారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# ప్రాచీన కట్టడాల కూల్చివేత చరిత్రహీనం

**మందస, జులై 12(వార్త):** మందసలోని చారిత్రక మండపాన్ని, దాని చుట్టూ ప్రత్యేకమైన రాతితో నిర్మించిన శిలాస్తరణాన్ని(రాతి ఫ్లోరింగ్) ధ్వంసం చేసిన విషయం పాఠకులకు తెలిసిందే. చారిత్రక ప్రదేశాల పరిరక్షణ పేరుతో జరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో, కళింగ సీమ సాధన కమిటీ నాయకుడు డాక్టర్ దువ్వాడ జీవితేజేశ్వరరావు ధ్వంసమైన ఈ ప్రదేశాన్ని పరిశీలించారు. 2100 సంవత్సరాల కిందట, అంటే ఖారవేలుడి పాలనా కాలంలో జరిగిన ఇటువంటి ప్రాచీన నిర్మాణాలను పరిరక్షించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. గోపాలసాగరం అభివృద్ధిలో భాగంగా నిర్మించ తలపెట్టిన ఓపెన్ జిమ్ నిర్మాణానికి కావలసిన ఖాళీ ప్రదేశం పుష్కలంగా ఉన్నప్పటికీ, ఈ చారిత్రక ప్రదేశాలను ధ్వంసం చేయడం చరిత్రహీనుల లక్షణమని ఆయన ఉద్వేగభరితంగా మాట్లాడారు. పూర్వకాలంలో జైన, హిందూ మతాలు వేర్వేరు శాఖలుగా ఉన్నప్పటికీ, తర్వాతి కాలంలో జైనం హిందూమతంలో మమేకమైందని అన్నారు. భారతీయ సంస్కృతిపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న సందర్భంలో, మందస ప్రాంతంలో ప్రాచీన సంస్కృతి విధ్వంసం జరుగుతుండటంపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడి శివాలయం గోడపై ఉన్న 23వ జైన తీర్థంకరుడైన వృషభనాథుడి విగ్రహం వరకు తవ్వకాలు జరిపారంటే, ఆ విగ్రహాన్ని కూడా ధ్వంసం చేయాలన్న కుట్రకోణం అందులో దాగి ఉందనే అనుమానాన్ని వ్యక్తంచేశారు. ప్రాచీన కట్టడాల పరిరక్షణ కమిటీ కన్వీనర్ మామిడి కోదండరావు మాట్లాడుతూ క్రీస్తుపూర్వం 50 ప్రాంతంలో శృంగ వంశాన్ని అంతం చేసి మహామేఘవాహన వంశానికి చెందిన ఖారవేలుడు కళింగ సామ్రాజ్యాధినేత అయిన తర్వాత, ఆయన జైన మతాన్ని రాజ్యమతంగా స్వీకరించి అనేక మారుమూల ప్రాంతాలలో సైతం జైన విస్తరణకు కృషి చేశాడన్నారు. ఈ కాలంలోనే మందస పూర్వ నగరంలో జైన ఆలయాల నిర్మాణానికి శ్రీకారం చుట్టాడని పేర్కొన్నారు. ఇతని పాలన తరువాత సాధారణ శకం 5వ శతాబ్దంలో గంగవంశీయుల పాలనలో మందస భౌగోళిక ప్రాంతం ఉండేదని, వీరి కాలంలో మహేంద్రగిరి నుండి మందస భౌగోళిక ప్రాంతం వరకు ఉన్న జైన ఆలయాలను శైవ మందిరాలుగా మార్చారని వివరించారు. అంటే, సుమారు



1500 సంవత్సరాల కిందటి నుండి అష్టశంభు లక్నేశ్వర ఆలయంగా గుర్తింపు పొందిన ఈ ఆలయ పరిసర ప్రాంతాలను ప్రాణప్రదంగా కాపాడుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తెలుగు ప్రజల ఆత్మాభిమానం కోసం అని చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం, మరోవైపు తెలుగు ప్రజల సంస్కృతిని ధ్వంసం చేస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని ప్రాచీన కట్టడాలను కాపాడాలని అన్నారు. ప్రముఖ సోషల్ వర్కర్ గిన్ని తిరుపతిరెడ్డి మాట్లాడుతూ గ్రామం మధ్యలో ఉన్న హై స్కూల్ గ్రౌండ్లో కాకుండా ఊరికి దూరంగా జిమ్ములు పెట్టడం వల్ల ప్రజలకు ఉపయోగం ఉంటుందా అని ప్రశ్నించారు. సాగరం పక్కన ఉండడం వలన ప్రమాదాలు కూడా ఉంటాయని అధికారులు గమనించాలని కోరారు. కాబట్టి ఎదురుగా ఉన్న ఖాళీ ప్లేస్ లో ఓపెన్ జిమ్ నిర్మాణం చేసినట్టుయితే ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, చట్టాన్ని చేతిలోకి తీసుకొని ప్రాచీన కట్టడాలను ధ్వంసం చేసిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గౌరంగపండా మాట్లాడుతూ, మందస చరిత్ర గురించి మాట్లాడాల్సి వచ్చినప్పుడు సుప్రసిద్ధ వాసుదేవ ఆలయం కన్నా అష్ట శంబు లక్నేశ్వరాలయం అత్యంత పురాతనమైనదని అన్నారు. ఈ నిర్మాణాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ చారిత్రక నిర్మాణాలను ధ్వంసం చేయడానికి కాంట్రాక్టర్‌కు పర్మిషన్ ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. ఈ విధ్వంసంతో మాకు సంబంధం లేదని చెబుతున్న అధికారులు కాంట్రాక్టర్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. కంచి బెహరా మాట్లాడుతూ, ధ్వంసమైన ఈ పురాతన మండపాన్ని ప్రభుత్వమే తిరిగి కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇది చారిత్రక ప్రదేశంగా గుర్తింపు పొందింది కాబట్టి, దీని చుట్టూ రక్షణ గోడ నిర్మించి ఈ ప్రదేశాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. నిరంజన్ బెహరా మాట్లాడుతూ, ఈ చారిత్రక ప్రదేశాన్ని కావాలనే ప్రణాళికాబద్ధంగా ధ్వంసం చేశారనడానికి అనేక అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు. సంతు మాట్లాడుతూ, శివాలయానికి వెళ్లే ప్రధాన దారిని పూర్తిగా లేకుండా చేసి, కొందరు అధికారులు మరియు కాంట్రాక్టర్లు ధార్మిక వ్యతిరేక పాత్ర పోషిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పూర్ణచందు పట్నాయక్, కురేష్, గొంగా బెహరా, బాసుదేవ, హేమంత్, గంట గోపి, గణపతి బెహరా తదితరులు పాల్గొన్నారు.

## అర్హత గల ఒక్క ఓటరు కూడా తప్పకూడదు



**మందస, జులై 12(వార్త):** భారత ఎన్నికల కమిషన్ వారి మార్గదర్శకాలకు అనుగుణంగా గత నెల జూన్ 15 నుంచి ఈ నెల జులై 14 వరకు ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని చేపడుతున్న ఓటర్లు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ప్రక్రియలో అర్హత గల ఏ ఒక్క ఓటరు కూడా తప్పకూడదని ఎన్నికల ప్రక్రియ సూపర్వైజర్, వెలుగు గ్రామీణాభివృద్ధి శాఖ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. ఎన్నికల విధులలో భాగంగా ఆదివారం మండలంలోని సరియాపల్లి సచివాలయంను సందర్శించి జాబితాను పరిశీలించి, బూత్ లెవెల్ ఆఫీసర్లతో మాట్లాడారు. పంపిణీ చేసిన ఎన్యూమరేట్ ఫారాలు అన్ని శత శాతం కలెక్ట్ చేసి డిజిటలైజేషన్ పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెత్, డబల్ ఎంట్రీ అన్నీ కూడా స్థానిక బూత్ లెవెల్ ఏజెంట్స్ సహకారంతో గుర్తించి బి.ఎల్.ఓ. లాగిన్ లో అప్లోడ్ చేయాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సిస్టు రమేష్, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ సెక్రటరీ సునీత, వెలుగు గ్రామసంఘం అసిస్టెంట్లు రేవతీ, బీమారావు తదితరులు పాల్గొన్నారు.

## షర్ట్ మేకర్ కుటుంబానికి ఆర్థికసాయం




**సోంపేట, జులై 12(వార్త):** సోంపేటకు చెందిన సాగర్ టైలర్ వద్ద షర్ట్ మేకర్‌గా పనిచేస్తున్న సుధా సాహూ అనే యువకుడు ఇటీవల అనారోగ్యం బారిన పడడంతో శస్త్ర చికిత్స చేయాల్సి వచ్చింది. ఆపదలో ఉన్న అటువంటి మిత్రునికి సోంపేటకు చెందిన శ్రీ లోకనాథేశ్వర కుట్టుపని సంక్షేమ సంఘం సభ్యులు ఆదివారం కవిటిలో గల సుదా సాహు ఇంటికి వెళ్లి పరామర్శించి 6000 రూపాయల నగదు సహాయం అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బుంగ మోహనరావు, ఉపాధ్యక్షుడు భత్తుల హేమంత్, సెక్రటరీ దుంప రమేష్,షావుకారి జానకిరావు,సాగర్ టైలర్ పొందూరు నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ




**కంచిలి, జులై 12(వార్త):** గొల్లకంచిలి గ్రామానికి చెందిన పులి లింగయ్య, కంచిలి మెయిన్ రోడ్ లో నివసించే కలియ పున్నమ్మ ఇటీవల మృతి చెందడంతో ఆయా కుటుంబాలను జడ్పిటిసి సభ్యురాలు ప్రతినిధి, మాజీ ఎంపీపీ ఇప్పిలి కృష్ణారావు తోపాటు పలువురు కలసి ఆదివారం ఆయా కుటుంబాలను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో మాజీ పిఎసిఎస్ అధ్యక్షుడు గుమ్మడి రామదాసు, మాజీ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి అచ్చెన్నాయుడిని పరామర్శించిన ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

**- ఆరోగ్య పరిస్థితిపై ఆరా - పోలాకి పర్యటనపై చర్చ**

**నరసన్నపేట, జులై 12(వార్త):** ఇటీవల నేత్ర శస్త్రచికిత్స చేయించుకున్న రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడిని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆదివారం మర్యాదపూర్వకంగా పరామర్శించారు. నిమ్మాడలోని మంత్రి క్యాంపు కార్యాలయానికి వెళ్లిన ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, అచ్చెన్నాయుడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా పూర్తి ఆరోగ్యంతో ప్రజాసేవలో పాల్గొనాలని ఆకాంక్షించారు. శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తవడంతో ఆయన ఆరోగ్యం త్వరితగతిన మెరుగుపడాలని కోరుతూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం పోలాకి మండలంలో మంత్రి అచ్చెన్నాయుడు చేపట్టనున్న పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు, కార్యక్రమాలపై ఇద్దరూ చర్చించారు. పర్యటన విజయవంతం అయ్యేలా అవసరమైన ఏర్పాట్లపై సమీక్షించినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.





## మృతురాలి కుటుంబానికి రూ.3.93 లక్షల బీమా క్లెయిం అందజేత

**- శ్రీరామ లైఫ్ ఇన్సూరెన్స్ ద్వారా ఆర్థిక భరోసా**

**- ప్రతి కుటుంబం జీవిత బీమా తీసుకోవాలని ప్రతినిధుల సూచన**

**జలుమూరు, జులై 12(వార్త):** లింగాలవలస గ్రామానికి చెందిన పంచిరెడ్డి సుశీల కుటుంబానికి శ్రీరామ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ రూ.3,93,457 విలువైన జీవిత బీమా క్లెయిం చెక్కును అందజేసింది. అనుకోని పరిస్థితుల్లో జీవిత బీమా కుటుంబాలకు ఆర్థిక భరోసాగా నిలుస్తుందని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. మూడు సంవత్సరాల క్రితం పంచిరెడ్డి సుశీల శ్రీరామ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో రూ.22 వేల ప్రీమియంతో జీవిత బీమా పాలసీ తీసుకున్నారు. ఇటీవల ఆమె మృతి చెందడంతో పాలసీ నిబంధనల ప్రకారం క్లెయిం మంజూరైంది. ఈ సందర్భంగా శ్రీరామ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఏజీఎం రామకృష్ణ, డీఎంఆర్ సతీష్, బీఎం కె. రమణ, బీడీఈ చక్రధర్, లింగాలవలస సర్పంచ్ స్వామిబాబు, డివో పంచిరెడ్డి సిమ్మన్న, ఎసీ కేశవరావు అంజి తదితరులు గ్రామానికి చేరుకుని మృతురాలి భర్త పంచిరెడ్డి లక్ష్మయ్యకు రూ.3,93,457 విలువైన క్లెయిం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ, జీవిత బీమా పాలసీలు కుటుంబ సభ్యులకు భవిష్యత్తులో ఆర్థిక రక్షణ కల్పిస్తాయని తెలిపారు. కుటుంబ పెద్దను కోల్పోయిన సమయంలో బీమా క్లెయిం ద్వారా ఆర్థిక ఇబ్బందులను కొంత మేర అధిగమించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం తమ అవసరాలకు అనుగుణంగా జీవిత బీమా పాలసీ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు, సంస్థ ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.



## కొండయే మాకు ముద్దు.. పరిశ్రమలు వద్దు

**- మాకు ఎంతో అండ.. ఈ కొండ**

**- ఈ కొండ పై పరిశ్రమల ఏర్పాటును ప్రభుత్వం ఉపసంహరించాలి**

**- నడిమివలస గ్రామస్తుల డిమాండ్**

**జి.సిగడాం, జులై 12(వార్త):** మా కొండ..మా బతుకులకు కొండంత అండ. అసలే మేము పేదలం, మాకు అప్పట్లో పట్టాలు ఇచ్చారు. మాకు ఉండేది ఒక కొండ మాత్రమే, మాకు భూములు లేవు, కొండమీది చెట్లు. చిన్న..చిన్నగా సాగు చేసుకుంటూ జీవిస్తున్నాం. కొంతమందికి ఆవులు, మేకలు, గొర్రెలతోపాటు మూగ జీవులకు ఆధారంతోపాటు పేదలకు జీవనోపాధి ఆ కొండ. ఆ కొండలేక పోతే మేము ఏలా జీవించేది అంటూ రైతులు, గ్రామస్తులంతా రోడ్డుఎక్కారు. నడిమివలస-గడబపాలెం గ్రామసమీపంలో ఉన్న కొండలో సుమారుగా 202 ఎకరాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడానికి రంగం సిద్ధం చేసింది. ఈ కొండలో ఏపీఐఐసీ పారిశ్రామికవాడగా ఏర్పాటు చేయడానికి అధికార యంత్రం ముందు అడుగులు వేసింది. సర్వే నెంబరు 36.38లో 202 ఎకరాలపై ఉన్న రైతులు ఆదివారం గ్రామంలో ఉన్న రామమందిరం వద్ద గ్రామస్తులంతా కలిసి సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. పట్టాలు ఉన్నవారు ఏవ్వరైనా ఇస్తే ఆభూమిలోనే మేము అంతా సాగు చేస్తామని ఆందోళన చెందుతున్నారు ఈనెల 7 వతేదిన గ్రామ సచివాలయంలో గ్రామ సభ నిర్వహించారు. వీటిలో కొండను పరిశ్రమవాడ కోసం తీర్మాణం చేయాలని అధికారులు విన్నవించుకున్నారు. దీనిపై గ్రామస్తుంతా ఎట్టి పరిస్థితిలో మా కొండను మేము ఇవ్వం మాకు ఇదే ఆధారం మేము సంతకాలు చేయం అంటూ నిరసన తెలిపారు. దీనిపై అధికారులు వెనుకు తిరిగారు.



### తిలారు ఫ్లైఓవర్ వద్ద ..

## ప్రయాణికుల షెడ్డు ఏర్పాటు చేయాలి

**- ఎండ, వర్షంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు**

**- తక్షణమే విశ్రాంతి గది నిర్మించాలని అధికారులకు విజ్ఞప్తి**



**జలుమూరు, జులై 12(వార్త):** నూతనంగా నిర్మించిన తిలారు ఫ్లైఓవర్ వంతెన వద్ద ప్రయాణికుల కోసం విశ్రాంతి గది (బస్ షెల్టర్) ఏర్పాటు చేయకపోవడంతో రోజువారీ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైల్వే స్టేషన్‌కు, సమీప కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, ఇతర ప్రయాణికులు బస్సుల కోసం ఫ్లైఓవర్ సమీపంలో వేచి ఉండాల్సి వస్తోందని తెలిపారు. అయితే అక్కడ కనీసం షెడ్డు లేకపోవడంతో మండుటెండల్లో ఎండకు నిలబడాల్సి వస్తోందని, వర్షాకాలంలో వానలో తడుస్తూ బస్సుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొన్నదని వాపోతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, విద్యార్థులు, చిన్నారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. రోజూ వందలాది మంది ఈ ప్రాంతం నుంచి రాకపోకలు సాగిస్తున్నప్పటికీ ప్రయాణికులకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని తిలారు ఫ్లైఓవర్ వద్ద తక్షణమే బస్ షెల్టర్‌తో పాటు తాగునీటి వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. అధికారులు స్పందించి త్వరితగతిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.


## ప్రారంభానికి నోచుకోని అంగన్వాడీ భవనం

**- రూ.లక్షతో నిర్మించిన భవనం వినియోగానికి దూరం**

**- త్వరగా ప్రారంభించి చిన్నారులకు అందుబాటులోకి తేవాలని**

**-ప్రజల విజ్ఞప్తి**

**జలుమూరు, జులై 12(వార్త):** జలుమూరులో లక్షల రూపాయల ప్రభుత్వ వ్యయంతో నిర్మించిన నూతన అంగన్వాడీ భవనం ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోకపోవడంతో స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాల ఆవరణలో కొన్నేళ్ల క్రితం భవనాన్ని నిర్మించినప్పటికీ, నేటికీ వినియోగంలోకి తీసుకురాకపోవడం విమర్శలకు తావిస్తోంది. భవనం నిర్మాణం పూర్తయినప్పటి నుంచి ప్రారంభోత్సవం జరగకపోవడంతో చిన్నారులు పాత భవనంలోనే ఇబ్బందుల మధ్య అంగన్వాడీ సేవలు పొందాల్సి వస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం నిధులు వెచ్చించి నిర్మించిన భవనం ఉపయోగంలోకి రాకపోవడం వల్ల ప్రజాధనం వృథా అవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంగన్వాడీ కేంద్రం ద్వారా చిన్నారులకు పోషకాహారం, ప్రాథమిక విద్య, ఆరోగ్య సేవలు అందుతున్న నేపథ్యంలో నూతన భవనాన్ని వెంటనే ప్రారంభించి అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి అవసరమైన ప్రక్రియలు పూర్తి చేసి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు. చిన్నారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఆలస్యం చేయకుండా అంగన్వాడీ భవనాన్ని ప్రారంభించి పూర్తి స్థాయిలో సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# ఉద్దానంలో మొబైల్ నెట్‌వర్క్ నో

- సిగ్నల్స్ సక్రమంగా లేక ప్రజలు ఇబ్బందులు
- అత్యవసర సమయాల్లో కూడా అదే పరిస్థితి
- నెట్ వర్క్ మెరుగు పరచాలని ప్రజల వినతి

**మందస, జులై 12(వార్త):** ఉద్దానం ప్రాంతంలో మొబైల్ నెట్‌వర్క్ సమస్య ఈ రోజు కొత్తది కాదు. ఎన్నో సంవత్సరాలుగా ప్రజలు కాల్ డ్రాప్‌లు, బలహీనమైన సిగ్నల్, నెమ్మదైన ఇంటర్నెట్ వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. డిజిటల్ ఇండియా గురించి ఎంత మాట్లాడుతున్నా, ఉద్దానం ప్రజలకు ఇప్పటికీ ఒక ఫోన్ కాల్ చేయడానికి బయటకు వెళ్లాల్సిన పరిస్థితులు కొన్ని గ్రామాల్లో కనిపిస్తున్నాయి.

ఈ పరిస్థితికి అసలు కారణం ఏమిటి?

భౌగోళిక పరిస్థితులు కూడా ప్రభావం చూపుతాయి. కొబ్బరి, జీడి తోటలు, విస్తరించిన గ్రామాలు, దూర ప్రాంతాలు---ఇవన్నీ మంచి కవరేజ్ అందించడానికి అదనపు టవర్లు అవసరమయ్యే పరిస్థితిని సృష్టిస్తాయి. ప్రతీ ఇంట్లో స్మార్ట్ ఫోన్ ఉంది. కానీ టవర్ల సంఖ్య అదే స్థాయిలో పెరిగిందా? చాలాచోట్ల సమాధానం "లేదు". ఒకే టవర్‌పై వేలాది మంది వినియోగదారులు ఆధారపడితే, సిగ్నల్ బలం, ఇంటర్నెట్ వేగం తగ్గడం సహజం.

ఇక్కడ మరో ముఖ్యమైన ప్రశ్న కూడా తలెత్తుతోంది. లక్షలాది మంది ప్రజలు 5జి ప్లాన్‌లతో రీఛార్జ్ చేస్తున్నారు. కానీ ఉద్దానం ప్రాంతంలోని ప్రతి గ్రామంలో నిజంగా 5జి సేవలు అందుతున్నాయా? 5జి పేరుతో రీఛార్జ్ చేసిన తర్వాత కూడా చాలామంది వినియోగదారులు 4జి లేదా అంతకంటే బలహీనమైన నెట్‌వర్క్ పైనే ఆధారపడుతున్నారని ఫిర్యాదు చేస్తున్నారు. 5జి సేవలు అందుబాటులో లేని ప్రాంతాల్లో వినియోగదారులు చెల్లిస్తున్న ధరకు తగిన సేవలు అందుతున్నాయా అనే ప్రశ్నకు టెలికాం సంస్థలు స్పష్టమైన సమాధానం దొరకడంలేదు. ప్రజలు డబ్బు చెల్లించేది కేవలం 5జి అనే పేరుకు కాదు. నాణ్యమైన, వేగవంతమైన సేవ కోసం. అందువల్ల సేవలు లేని ప్రాంతాల్లో నెట్‌వర్క్ విస్తరణకు ప్రాధాన్యం ఇవ్వడం టెలికాం సంస్థల బాధ్యత ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. ఈ సమస్యకు పరిష్కారం విమర్శల్లో కాదు, సమన్వయంలో ఉంది. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, టెలికాం సంస్థలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి ఉద్దానం ప్రాంతానికి ప్రత్యేక నెట్‌వర్క్ అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని స్థానికులు కోరుతున్నారు. గ్రామాల వారీగా సిగ్నల్ సర్వే చేసి, అవసరమైన చోట కొత్త టవర్లు ఏర్పాటు చేయాలి. ఫైబర్ కనెక్టివిటీని బలోపేతం చేయాలి. మొబైల్ నెట్‌వర్క్ అనేది ఇప్పుడు విలాసం కాదు. అది విద్య,



వైద్యం, వ్యవసాయం, ఉపాధి, అత్యవసర సేవలు, ప్రభుత్వ సేవలకు ప్రాథమిక మౌలిక సదుపాయం. ఉద్దానం ప్రజలకు నాణ్యమైన నెట్‌వర్క్ అందించడం అభివృద్ధిలో కీలకమైన అడుగుగా గుర్తింపు ఉంది. కాగా, ఉద్దానం ప్రజలకు నాణ్యమైన మొబైల్ నెట్‌వర్క్ ఎప్పుడు అందుతాయి. 5జి రీఛార్జ్ చేస్తున్న ప్రతి వినియోగదారుడికి నిజంగా 5జి సేవలు అందుతున్నాయా? ప్రజలు చెల్లిస్తున్న ధరకు తగిన సేవలు అందుతున్నాయా? ఈ సమస్యకు బాధ్యత ఎవరు తీసుకుంటారని ఉద్దానం ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వ్యాపారం కోణంలో కాకుండా ఉద్ధానం సమస్యలను దృష్టిలో పెట్టుకుని, నెట్ వర్కులను మెరుగు పరచాలని ప్రజలు కోరుతున్నారు.

## కళింగ వైశ్య యువజన సంఘం కోశాధికారిగా తంగుడు జయచంద్ర



**పలాస, జులై 12 (వార్త):** పలాస కళింగ వైశ్య యువజన సంఘం కోశాధికారిగా తంగుడు జయచంద్రని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పలాస వైశ్య సంఘం అధ్యక్షులు డోకి నాగేశ్వరరావు తెలిపారు. పలాస వైశ్య సంఘంలో కీలక భూమిక పోషించే యువజన సంఘం బొలోపేతానికి జై చంద్ర పనిచేస్తారని నాగేశ్వరరావు తెలిపారు. వైశ్య సామాజిక వర్గానికి చెందిన యువతరం సంక్షేమానికి వారి సమస్యల పరిష్కారానికి యువజన సంఘం ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం అయినదని తెలిపారు. జై చంద్ర నియామకం పట్ల పలాస వైశ్య సంఘ పెద్దలు, కాశీబుగ్గ వైశ్య సంఘ నేతలు కోటిని విజయ్, పెంట రత్నాకర్లు అభినందనలు తెలిపారు.

## శ్రీరామయోగి బాబా ఆశ్రమంలో ఆధ్యాత్మిక సత్సంగ సభ

- ఆధ్యాత్మిక జీవనమే మానవ జీవితానికి మార్గదర్శకం
- ప్రవచనకారులు ఏలాల శ్రీనివాసరావు
- 250వ సత్సంగం నిర్వహణ విశేషమని వెల్లడి



**పోలాకి, జులై 12(వార్త):** చింతాడపేటలోని శ్రీ రామయోగి బాబా ఆశ్రమంలో ఆదివారం ఆధ్యాత్మిక సత్సంగ సభ భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించారు. ఆశ్రమంలో జరిగిన ఈ కార్యక్రమానికి భక్తులు, ఆధ్యాత్మికవేత్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. లైదాం ఆశ్రమానికి చెందిన ప్రముఖ ప్రవచనకారులు ఏలాల శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మానవ జీవితంలో ఆధ్యాత్మికతకు విశేష ప్రాధాన్యత ఉందని, భగవంతుని స్మరణ, సత్సంగం ద్వారా మనశ్శాంతి, సత్ప్రవర్తన అలవడుతాయని అన్నారు. ఆధునిక జీవనశైలిలో ప్రతి ఒక్కరూ కొంత సమయాన్ని ఆధ్యాత్మిక చింతనకు కేటాయించాలని సూచించారు. శ్రీ రామయోగి బాబా ఆశ్రమంలో ఇప్పటివరకు 250 సత్సంగ సభలు విజయవంతంగా నిర్వహించడం విశేషమని ఆయన పేర్కొన్నారు. ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో నైతిక విలువలు, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని అన్నారు. బమ్మిడి విశ్వనాథం అధ్యక్షతన జరిగిన ఈ సత్సంగ సభలో భక్తులు భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. పలువురు గ్రామ పెద్దలు, ఆశ్రమ నిర్వాహకులు, భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



## వంశధార ప్రాజెక్టు రైతాంగానికి జీవనాడి

- వంశధార జలాలకు గంగపూజ
- టెక్కలిపట్నం వద్ద జలహారతి

**పలాస, జులై 12 (వార్త):** వంశధార ప్రాజెక్టు ఉత్తరాంధ్ర రైతాంగానికి జీవనాడని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పేర్కొన్నారు. నియోజకవర్గ రైతాంగానికి, ప్రజలకు జీవనాధారమైన వంశధార నదిలో టెక్కలి పట్నం వద్ద నీరు చేరిన సందర్భంగా ఆదివారం ప్రత్యేకంగా గంగపూజ నిర్వహించి జలహారతి సమర్పించారు. వేద మంత్రోచ్చారణల మధ్య సంప్రదాయబద్ధంగా జరిగిన ఈ కార్యక్రమంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, పలాస నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరి, ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, వంశధార ప్రాజెక్టు కమిటీ చైర్మన్ రవీంద్ర, నిరంజన్, ఈఈ శేఖర్, నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, వంశధార ప్రాజెక్టు అధికారులు గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి, వంశధార జలాలు ఎల్లప్పుడూ సమృద్ధిగా ప్రవహిస్తూ రైతులకు, ప్రజలకు శాశ్వత ప్రయోజనం చేకూరాలని ప్రార్థించారు. నదిలో జలహారతి సమర్పించి, వంశధార జలాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, నాయకులు మాట్లాడుతూ వంశధార ప్రాజెక్టు ఉత్తరాంధ్ర రైతాంగానికి జీవనాడి అని పేర్కొన్నారు. సాగునీరు సమృద్ధిగా అందడం వల్ల వేలాది ఎకరాల్లో వ్యవసాయం అభివృద్ధి చెందడంతో పాటు భూగర్భ జలాల మట్టాలు పెరిగి తాగునీటి సమస్య కూడా గణనీయంగా తగ్గుతుందని తెలిపారు. రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, సాగునీటి వనరుల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. వంశధార జలాలు చేరడం కేవలం ఒక సహజ ప్రక్రియ మాత్రమే కాకుండా, రైతుల్లో కొత్త ఆశలను నింపే శుభపరిణామమని వారు పేర్కొన్నారు. నీటి ప్రతి బొట్టును సద్వినియోగం చేసుకుంటూ వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి చేయాలని రైతులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలాస నియోజకవర్గానికి చెందిన పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, రైతులు, స్థానిక ప్రజలు, వంశధార ప్రాజెక్టు అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని గంగమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వేదపండితుల ఆశీర్వచనాల మధ్య కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా ముగిసింది.

## మర్రివలసలో తల్లి..కుమార్తెలకు గ్రామస్థులే అంతిమ వీడ్కోలు

- పూర్తి వివరాలు సేకరించిన సీఐ శ్రీనివాసరావు
- బంధువులు ముందుకు రాకపోవడంతో చందాలు సేకరించి అంత్యక్రియలు నిర్వహించిన గ్రామస్తులు



**జలుమూరు, జులై 12(వార్త):** మర్రివలస గ్రామంలో తల్లి, కుమార్తెల మృతి ఘటనకు సంబంధించి నరసన్నపేట సీఐ శ్రీనివాసరావు శనివారం గ్రామాన్ని సందర్శించి స్థానికుల నుంచి పూర్తి వివరాలను సేకరించారు. ఘటనకు సంబంధించిన అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతోందని ఆయన తెలిపారు. మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తయిన అనంతరం అంత్యక్రియలు నిర్వహించేందుకు బంధువులు ఎవరూ ముందుకు రాకపోవడంతో గ్రామస్థులే మానవత్వాన్ని చాటుకున్నారు. గ్రామంలో చందాలు సేకరించి తల్లి, కుమార్తెలకు అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ, బంధువులు ఉన్నప్పటికీ ఎవరూ ముందుకు రాకపోవడం బాధాకరమైన విషయమని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో గ్రామస్థులు చూపిన మానవత్వం అభినందనీయమని పేర్కొన్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తున్నామని, విచారణ అనంతరం తదుపరి చర్యలు చేపడతామని పోలీసులు తెలిపారు. గ్రామస్థుల సహకారంతో అంత్యక్రియలు ప్రశాంతంగా పూర్తయ్యాయి.

## సొంత నిధులతో ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి

- రూ.40 వేలతో ముందుకొచ్చిన గ్రామస్థుడు వీరభద్రరావు
- దాతృత్వాన్ని అభినందించిన గ్రామస్థులు



**సారవకోట, జులై 12(వార్త):** కురిడింగి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి స్థానిక గ్రామస్థుడు వీరభద్రరావు సొంత నిధులతో ముందుకు రావడం అభినందనీయమని గ్రామస్థులు పేర్కొన్నారు. వర్షాకాలంలో పాఠశాల ఆవరణలోకి వర్షపు నీరు చేరడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఆయన రూ.40 వేల స్వంత ఖర్చుతో అభివృద్ధి పనులు చేపట్టారు. పాఠశాల సమస్యలపై పలుమార్లు సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ నిధులు మంజూరు కాకపోవడంతో సమస్య యథాతథంగా కొనసాగిందని గ్రామస్థులు తెలిపారు. దీంతో విద్యార్థుల ఇబ్బందులను గుర్తించిన వీరభద్రరావు ఆలస్యం చేయకుండా స్వచ్ఛందంగా నిధులు వెచ్చించి అవసరమైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ పనుల ద్వారా పాఠశాల ఆవరణలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవడంతో పాటు విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. విద్యాభివృద్ధికి దాతృత్వంతో ముందుకొచ్చిన ఆయన సేవలను పలువురు కొనియాడారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రజలు భాగస్వాములు కావడం అభినందనీయమని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. పాఠశాల మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కూడా తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.

## రక్షిత నీటి పథకం
# ట్యాంకుల స్థలాల ఆక్రమణ

- పెద్దదూగాంలో ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి
- అధికారులు వెంటనే స్పందించాలని స్థానికుల డిమాండ్

**జలుమూరు, జులై 12(వార్త):** పెద్దదూగాం గ్రామంలో నిర్మించిన రక్షిత నీటి పథకం ట్యాంకుల పరిసర ప్రభుత్వ స్థలాలపై ఆక్రమణలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ కంఠంలో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకుల దిగువ భాగంలోని స్థలాలను కొందరు స్వార్థపరులు ఆక్రమించుకుంటున్నట్లు ఆరోపిస్తున్నారు. గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు నిర్మించిన రక్షిత నీటి పథకం ట్యాంకుల చుట్టుపక్కల ప్రాంతం ప్రభుత్వ ఆస్తిగా ఉండగా, అక్కడ అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలు పెరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. దీంతో భవిష్యత్తులో తాగునీటి పథకం నిర్వహణకు ఆటంకాలు ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత రెవెన్యూ, గ్రామపంచాయతీ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి ఆక్రమణలను గుర్తించి తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రభుత్వ స్థలాలను పరిరక్షించి రక్షిత నీటి పథకం పరిసరాలను కాపాడేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజలకు ఉపయోగపడే మౌలిక సదుపాయాల వద్ద ఆక్రమణలు జరగకుండా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టి, ప్రభుత్వ ఆస్తులను సంరక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



## ప్రారంభానికి నోచుకోని వెల్‌నెస్ కేంద్రం

- ఆరు నెలలుగా సిద్ధంగా ఉన్న భవనం - వినియోగంలోకి రాని వైనం
- త్వరగా ప్రారంభించి ప్రజలకు వైద్య సేవలు అందించాలని స్థానికుల విజ్ఞప్తి

**నరసన్నపేట, జులై 12(వార్త):** నరసన్నపేట మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో నిర్మించిన వెల్‌నెస్ కేంద్రం భవనం పూర్తయి నెలలు గడుస్తున్నప్పటికీ ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోకపోవడం స్థానికుల్లో అసంతృప్తికి దారితీస్తోంది. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో నిర్మించిన ఈ కేంద్రం వినియోగంలోకి రాకపోవడంపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో నిర్మాణ పనులు పూర్తై సుమారు ఆరు నెలలు గడిచినా, ఇప్పటికీ కేంద్రాన్ని ప్రారంభించకపోవడం గమనార్హం. మరోవైపు వెల్‌నెస్ కేంద్రం ప్రస్తుతం అద్దె ప్రైవేటు భవనంలోనే కొనసాగుతుండటంపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ నిధులతో నిర్మించిన సొంత భవనం అందుబాటులో ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు ప్రారంభించడంలో జాప్యం చేయడం వల్ల ప్రజలకు పూర్తి స్థాయిలో సేవలు అందడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఆధునిక సౌకర్యాలతో నిర్మించిన భవనాన్ని వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు. ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందించేందుకు సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని వెల్‌నెస్ కేంద్రాన్ని ప్రారంభించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. భవనం ఖాళీగా ఉండకుండా ప్రజల ప్రయోజనాల కోసం ఉపయోగంలోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు.




## ప్రజా సంకల్ప స్థూపానికి మెరుగులు



**ఇచ్ఛాపురం, జులై 12(వార్త):** మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రజా సంకల్ప పాదయాత్ర ముగింపు నకు గుర్తుగా నిర్మించిన స్థూపానికి మెరుగులు దిద్దుతున్నారు. పాదయాత్ర ముగింపు గుర్తుగా ఇచ్ఛాపురంలో ఏర్పాటు చేసిన పైలాన్ చుట్టూ ఇటీవల పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం పెరగడంతో వైస్సార్సీపీ నియోజకవర్గ సమనవ్య కర్త సాడి శ్యాంప్రసాద్ రెడ్డి పార్టీ కార్యకర్తలతో కలిసి ప్రాంగణాన్ని శుభ్రం చేయించారు. ఇప్పటికే కొత్త గేట్ ఏర్పాటు చేశారు. దివంగత ముఖ్యమంత్రి వై ఎస్ ఆర్ విగ్రహంఏర్పాటు. భారీగా పార్టీ జెండా ఏర్పాటుకు సిమెంట్ బేస్ మరియు పోల్ ఏర్పాటు. పాత ఫోటో ల స్థానంలో కొత్త ఫోటోలు ఏర్పాటుపార్కింగ్ టైల్స్. గార్డెన్ ఏర్పాటు. ఆర్ వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు. పాడైన టైల్స్ నేమ్ ప్లేట్స్ పునరుద్ధరణ. సోలార్ లైటింగ్ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# వంశధార పరవళ్లకు జలహారతి



బ్రాహ్మణతర్లాలో

## పాత్రుని కోనేరు వివాదం

మరమ్మతుల పేరుతో చేపలు విక్రయం

చేస్తున్న కొంతమంది రైతులు



**పలాస, జులై 12 (వార్త):** బ్రాహ్మణతర్లా పాత్రుని కోనేరు చెరువులో కొంతమంది రైతులు చెరువు మరమ్మత్తుల పేరుతో అన్యాయంగా, అక్రమంగా చేపలు అమ్ముకుంటున్నారని బ్రాహ్మణతర్లా గ్రామానికి చెందిన సుభాష్ చంద్రబోస్ గ్రామ పౌరుడిగా, పంచాయతీ మాజీ పాలకవర్గ సభ్యుడిగా ప్రస్తుతం గ్రామంలో జరుగుతున్న అన్యాయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లేందుకు ప్రయత్నిస్తున్నానని ఒక ప్రకటనలో ఆదివారం తెలిపారు. బ్రాహ్మణతర్లా గ్రామానికి సంబంధించి పాత్రుని కోనేరు చేపల వ్యవహారం ప్రతి ఏడాది సుమారు మార్కెట్ పాట లక్ష రూపాయలకు వెళ్ళేదని తెలిపారు. ఈ ఏడాది గ్రామంలో ఉన్న కొంతమందివడ్డి. యాదగిరి, కంసాల వెంకట్రావు, అలా కృష్ణ, వీళ్లు మరి కొంతమంది చెరువు మరమ్మత్తు చేస్తామని నెపంతో లక్షల విలువ చేసే చాపలను పట్టి విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని అధికారులు ఎంపీడీవోకి, గ్రామ కార్యదర్శికి తెలియజేస్తే మాకు ఏమీ తెలియదని సమాధానం ఇచ్చారని తెలిపారు. కాబట్టి తక్షణమే పై అధికారులు దీనిపై స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను

ఎన్యూమరేషన్ ఫారాలు

## తప్పనిసరిగా సమర్పించాలి

-14లోగా వివరాలు అందజేయాలి

- ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై

అవగాహన కల్పించిన రాజశేఖర్



**జలుమూరు, జులై 12(వార్త):** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) అందజేస్తున్న ఎన్యూమరేషన్ ఫారాలను ప్రతి ఓటరు తప్పనిసరిగా పూర్తి చేసి జూలై 14లోగా తిరిగి సమర్పించాలని నేషనల్ పార్టీ 2024 శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర నాయకులు నాయుడుగారి రాజశేఖర్ పిలుపునిచ్చారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణ ఓటరు జాబితా సవరణలో అత్యంత కీలకమని చెప్పారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత జూలై 21న విడుదలయ్యే ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు నమోదవుతాయని వివరించారు. శ్రీకాకుళం జిల్లాలో మొత్తం సుమారు 18.99 లక్షల మంది ఓటర్లు ఉండగా, ఇప్పటివరకు సుమారు 14 లక్షల ఫారాలు మాత్రమే డిజిటలైజేషన్ పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన ఫారాలను వేగంగా సేకరించి వంద శాతం లక్ష్యాన్ని చేరుకునేందుకు బూత్ లెవల్ ఏజెంట్లు, బీఎల్ఓలకు పూర్తి సహకారం అందించాలని కోరారు. గత ఓటరు జాబితాలో పేరు లేకపోయినా ఓటు హక్కు కోల్పోరని, సంబంధిత ఫారం నింపి సమర్పించడం ద్వారా తిరిగి ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉంటుందని రాజశేఖర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఉపసర్పంచ్ ప్రతినిధి గుంట కర్ణ వీరుడు మాట్లాడుతూ, జూలై 21 నుంచి ఆగస్టు 20 వరకు ముసాయిదా ఓటరు జాబితాపై అభ్యంతరాలు, కొత్త ఓటర్ల నమోదు, వివరాల సవరణకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. జూలై 1 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత ఫారం-6తో పాటు అవసరమైన డిక్లరేషన్ సమర్పించి కొత్త ఓటు హక్కు పొందవచ్చన్నారు. అదేవిధంగా, ఓటరు జాబితా నుంచి పేరు తొలగించేందుకు ఫారం-7, పేరు, చిరునామా లేదా ఇతర వివరాల్లో సవరణల కోసం ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని ఓటర్లకు సూచించారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ ఓటరు వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

-మూడేళ్లుగా పలాసకు వంశధార నీళ్లు మేమే తెస్తున్నాం

- నాలుగేళ్ల మంత్రిగా ఒక్క చుక్క కూడా ఇవ్వలేకపోయారు

- మాజీ మంత్రి సీదిరిపై ఎమ్మెల్యే శిరీష ఘాటు విమర్శలు

- టెక్కలి పట్టణం కాలువ వద్ద ఎమ్మెల్యే గౌతు శిరీష జలహారతి

- రైతులకు సమృద్ధిగా పంటలు పండాలని ఆకాంక్ష



**పలాస, జులై 12(వార్త):** పలాసకు వంశధార నీళ్లు మూడేళ్లుగా మేమే తెస్తున్నామని, నాలుగేళ్ల మంత్రిగా పని చేసిన వ్యక్తి ఒక్క చుక్క కూడా ఇవ్వలేకపోయారని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ధ్వజమెత్తారు. హిరమండలం రిజర్వాయర్ నుంచి వంశధార జలాలను విడుదల చేయడంతో పలాస మండలం టెక్కలి పట్టణంలోని ప్రధాన కాలువలో ఆదివారం నీరు పరవళ్లు తొక్కుతూ ప్రవహించింది. ఈ సందర్భంగా పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కాలువ వద్ద ప్రత్యేకంగా జలహారతి కార్యక్రమం నిర్వహించారు. వంశధార జలాలకు హారతులు ఇచ్చి పూజలు నిర్వహించిన ఆమె, పలాస ప్రాంత రైతుల పొలాలకు సాగునీరు సమృద్ధిగా చేరి పంటలు బాగా పండాలని, ఈ ప్రాంతం సస్యశ్యామలంగా మారాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కాలువ గట్టుపై పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు, రైతులు పాల్గొనగా హర్షధ్వానాల నడుమ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. వంశధార జలాలు కాలువలో ప్రవహిస్తున్న దృశ్యాలను స్థానికులు ఆసక్తిగా వీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా పలాస ప్రాంత రైతులకు వంశధార ఏడవ కాలువ ద్వారా సాగునీరు అందిస్తున్న ఘనత ఎన్డీయే ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ రైతులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుని వంశధార జలాలను అందించిందన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సిదిరి అప్పలరాజుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వంలో నాలుగేళ్లు మంత్రిగా కొనసాగినప్పటికీ పలాస రైతులకు "ఒక్క చుక్క వంశధార నీటిని కూడా తీసుకురాలేకపోయారని" మండిపడ్డారు. గత ప్రభుత్వ అసమర్థ పాలనకు, ప్రస్తుతం ప్రజల అవసరాలను గుర్తించి పనిచేస్తున్న ప్రభుత్వానికి ఉన్న తేడాను ప్రజలు గమనించాలని అన్నారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. వర్షాలు లేకున్నా రైతుల పంటలు ఎండిపోకుండా సాగునీటిని అందించడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని చెప్పారు. పలాస ప్రాంతానికి వంశధార జలాలు అందించేందుకు ప్రత్యేక చొరవ చూపిన జిల్లా కలెక్టర్, రాష్ట్ర వ్యవసాయ, నీటిపారుదల రంగ అభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడులకు ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. వంశధార జలాలు కాలువలోకి చేరడంతో పలాస ప్రాంత రైతుల్లో కొత్త ఆశలు చిగురించాయని, ఖరీఫ్ సాగుకు ఇది ఎంతో ఊరటనిస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలాస నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



శ్రీముఖలింగేశ్వర స్వామిని దర్శించుకున్న

## హైకోర్టు న్యాయమూర్తి

- కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు నిర్వహించిన జస్టిస్ ఆలపాటి గిరిధర్

- పూర్ణకుంభ స్వాగతంతో సన్మానించిన ఆలయ అధికారులు

**జలుమూరు, జులై 12(వార్త):** ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆలపాటి గిరిధర్ కుటుంబ సభ్యులతో కలిసి దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగేశ్వర స్వామి ఆలయాన్ని శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన న్యాయమూర్తికి దేవస్థానం పూజారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన జస్టిస్ ఆలపాటి గిరిధర్ కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పూజలు ముగిసిన అనంతరం ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ సంప్రదాయాలకు అనుగుణంగా న్యాయమూర్తి కుటుంబ సభ్యులకు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికి ఆలయ విశిష్టతను వివరించినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో జలుమూరు ఎస్ఐ, ఆలయ ఎండోమెంట్ అధికారి, దేవస్థానం సిబ్బంది, పూజారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ..

## పిచ్చిమొక్కలు తొలగించాలి

- విషసర్పాల సంచారంపై స్థానికుల ఆందోళన

- చిన్నారులు, గర్భిణుల భద్రతకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి

**నరసన్నపేట, జులై 12(వార్త):** నరసన్నపేట మేజర్ పంచాయతీ పరిధిలోని వంశధార కాలనీ అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ పిచ్చిమొక్కలు, గుబురుగా పెరిగిన పొదలు పేరుకుపోవడంతో చిన్నారులు, గర్భిణుల భద్రతపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి ప్రతిరోజూ చిన్నారులు, గర్భిణులు, బాలింతలు రాకపోకలు సాగిస్తుండగా, కేంద్రం పరిసర ప్రాంతం పూర్తిగా పిచ్చిమొక్కలతో నిండిపోవడం వల్ల విషసర్పాలు, ఇతర హానికర జీవులు సంచరించే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. దీంతో కేంద్రానికి వచ్చే వారు భయాందోళనలకు గురవుతున్నట్లు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు, గుబురు పొదలను వెంటనే తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి చిన్నారులు, గర్భిణులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కేంద్రానికి రాకపోకలు సాగించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిశుభ్రత, భద్రతపై సంబంధిత శాఖలు ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడు నిర్వహణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



ఆక్రమణలతో మాయమవుతున్న

## రంగసాగరం చెరువు

- వందల ఎకరాల సాగుకు ఆధారమైన చెరువు పరిరక్షించాలని రైతుల విజ్ఞప్తి

- చర్యలు చేపట్టాలని అధికారులను కోరుతున్న స్థానికులు



**సారవకోట, జులై 12(వార్త):** సారవకోట మండలంలోని అర్లీ గ్రామ సమీపంలో ఉన్న చారిత్రక రాజులనాటి రంగసాగరం చెరువు రోజురోజుకూ అక్రమ ఆక్రమణలకు గురవుతోందని స్థానిక రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శతాబ్దాల క్రితం పర్లాకిమిడి మహారాజులు వ్యవసాయ అవసరాల కోసం నిర్మించిన ఈ చెరువు ప్రస్తుతం తన ఉనికిని కోల్పోయే పరిస్థితికి చేరుకుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జలుమూరు, సారవకోట మండలాల్లోని వందలాది ఎకరాల వ్యవసాయ భూములకు సాగునీటిని అందించే ప్రధాన జలవనరుగా రంగసాగరం చెరువు నిలుస్తోంది. అయితే ఇటీవల కాలంలో చెరువు పరిధిలో ఆక్రమణలు పెరుగుతుండటంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతుందనే ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది. చెరువును పరిరక్షించడంలో సంబంధిత శాఖలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆక్రమణలను వెంటనే తొలగించి చెరువు హద్దులను పరిరక్షించకపోతే భవిష్యత్తులో సాగునీటి సమస్య తీవ్రంగా మారే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు. వ్యవసాయమే ప్రధాన ఆధారంగా జీవిస్తున్న ఈ ప్రాంతంలో రంగసాగరం చెరువు కీలక పాత్ర పోషిస్తోందని, చెరువు ఆక్రమణకు గురైతే వందలాది ఎకరాల్లో సాగు దెబ్బతినే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఈ చెరువును ఆక్రమణల నుంచి రక్షించి, పునరుద్ధరణ పనులు చేపట్టి సాగునీటి వనరును కాపాడాలని రైతులు, స్థానిక ప్రజలు ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను కోరుతున్నారు.

## మాలల సమస్యలపై మేధోమధనం చేయాలి

**ఇచ్ఛాపురం, జులై 12(వార్త):** ఆంధ్రప్రదేశ్ మాలల సంక్షేమ ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కోట్ల గంగాధర్ ఆధ్వర్యంలో మాల మహాసభ వ్యవస్థాపక అధ్యక్షులు మల్లెల వెంకటరావు సారధ్యంలో మాల మహానాడు,మాల విద్యార్థి సంఘాలు, అంబేద్కర్ యువజన సంఘాలు రాష్ట్రంలో ఉన్నటువంటి, మాల ఉద్యోగ సంఘాలు కలసి, చేపట్టిన మాలల ఐక్యత చైతన్య యాత్ర, హిందూపురంలో మొదలుపెట్టి ఇచ్ఛాపురంలో ముగిసింది.ఈ సందర్భంగా మాట్లడుతూ ఈ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో మాలలు ఎదుర్కొంటున్న సమస్యలు గురించి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అభ్యర్థనలు పరిశీలన చేసుకొని వీటన్నిటిపై మేధోమధనం చేయాలని కోరారు. ఈ రాష్ట్రంలో మాల జాతి ఎదుర్కుంటున్న ఎదుర్కొంటున్న అనేక సమస్యలు, ఈ కూటమి ప్రభుత్వంలో మాలలపై జరుగుతున్న ప్రత్యక్ష దాడులు, హత్యలు,అత్యాచారాలు, మాల ఉద్యోగుస్తులపై వేధింపులు ఏసీబీ దాడులు, అవమానాలు, సంక్షేమ పథకాల నిలిపివేత, మాల జాతిని సర్వనాశనం చేయుటకు కంకణం కట్టుకున్నటువంటి ఈ కూటమి ప్రభుత్వాన్ని గద్దెదించుటకు అన్నిటిని రిశీలించి పరిష్కరించే మార్గంలో ఒక పరిష్కార మార్గం చూపుటకు భవిష్యత్తు ప్రణాళిక కార్యాచరణ దిశలో ఉద్యమాన్ని ఉధృతం చేసి మా హక్కులు సాధించే వరకు, వర్గీకరణ రద్దు, చేసేవరకు, బాలల సత్తా ఏంటో చూపిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో. ఎన్. మోహన రావు (జైభీమ్ సేన వ్యవస్థాపకఅధ్యక్షులు). వెంకటరావు (జైభీమ్ సేన్ అధ్యక్షుడు). ప్రకాశరావు, (ఉపాధ్యక్షులు.)కంచిలి ఉపాధ్యక్షులు.ఎన్. బాబూరావు చల్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.




Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546